## మైసమ్మకు పూజలు చేసిన మాజీ మంత్రి



నాయకులతో మాజీ మంత్రి

వనపర్తి టౌన్, మే 6 : జెర్రిపోతుల మైసమ్మను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో జరిగిన పలు వేడుకల్లో మాజీ మంత్రి హాజరయ్యారు. రాజనగరం వద్ద ఉన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగిన భువనేశ్వరి, అజిత్ కుమార్‌ల వివాహానికి ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగన్న, రాజు, అరుణ్, శ్రవణ్, గిరి, రాము, లక్ష్మణ్‌గౌడ్, పురేందర్‌రెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి, రహీం, వాహీద్, జోహెబ్ పాల్గొన్నారు.

## స్పీకర్ ప్రసాద్‌కు ఘన స్వాగతం



పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అలంపూర్, మే 6 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదోశక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అంతకుముందు వారికి పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుల చిత్రపటాలను స్పీకర్‌కు అందజేశారు. అంతకుముందు అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు తెలంగాణ టూరిజం హోటల్ వద్ద స్వాగతం పలికారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం : ఎమ్మెల్యే విజయుడు



ఎల్‌సీవో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, మే 6: ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదని, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం రాజోలి మండలం చిన్న తాండ్రపాడుకు చెందిన కృష్ణవేణి ఆపరేషన్‌కోసం రూ.4లక్షల ఎల్‌వోసీ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాజోలి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజల చెంతకే అధికారులు : కలెక్టర్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ఇటిక్యాల, మే, 6 : గ్రామాల్లో భూతగాదాలను పరిష్కరించేందుగాను రెవెన్యూ అధికారులు ప్రజల చెంతకు వస్తున్నారని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎల్ సంతోష్ సూచించారు. ప్రభుత్వం భూభారతి చట్టం అమలులో భాగంగా మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల రెండోమంగళవారం వావిలాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పెండింగ్ సాదాబైనామా, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు అందక పోవడం తదితర సమస్యలను గుర్తించి సదస్సులోనే పరిష్కరిస్తామన్నారు. రైతులు సదస్సుల లో తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి శాశ్వత పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మినారాయణ, తాసీల్దార్లు, బద్రప్ప, నరేశ్, వ్యవసాయ అధికారి రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉన్నత స్థాయికి ఎదగాలి

గద్వాల, మే 6 : విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే కష్టపడే తత్వం ఉండాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పది ఫలితాల్లో 550పైగా మార్కులు సాధించిన 34మంది విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పది ఫలితాల్లో రాష్ట్రంలో 32వ స్థానం నుంచి 26వ స్థానానికి పురోగతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్‌గని, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఆత్మీయసమ్మేళనంలో 2007–09బ్యాచ్ విద్యార్థులు

గద్వాలటౌన్, మే 6 : సమాజాభివృద్ధిలోనూ విద్యార్థులు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2007–09 విద్యాసంవత్సరంలో ఇంటర్ హెచ్ఈసీ పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం కళాశాలలో ఆత్మీయసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన తోపాటు అధ్యాపకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదవుకున్న కళాశాల అభివృద్ధికి తోడ్పడుతూ ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకోనేందుకు ముందుండాలని సూచించారు. ఉన్నతిగా ఆలోచిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. అంతకుముందు విద్యార్థులు కళాశాలలో తమ తరగతి గదులను తిరుగుతూ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు శ్రీదేవి, సత్యమ్మ, విజయలక్ష్మి, సునీల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

LONG TERM COACHING
★ BiPC-NEET & MPC-IIT Long Term Coaching Start on June, 1st , SRI CHAITANYA JR. COLLEGE, Hyd. Contact. K. ASHOK REDDY, A.O., Cell:9441884705
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మున్ననూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సును సందర్శించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, మే 6 : భూ సమస్య ఉన్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం మండలంలోని మున్ననూర్, తాడిపర్తి గ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులను ఆయన తనిఖీ చేశారు. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ రెవెన్యూ శాఖను సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో ప్రజలను అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న గ్రామంలో దరఖాస్తులను ఒక రోజు పంపించడం అదే విధంగా టాంటాం వేయించడం వంటివి చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్ననూర్‌లో 35 దరఖాస్తులు, తాడిపర్తిలో 36, వెరసి 71 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు.

**తాడిపర్తిలో కొనుగోలు కేంద్రం పరిశీలన**

మండలంలోని తాడిపర్తిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. వరి కొనుగోలు కేంద్రంలో వచ్చిన ధాన్యాన్ని తూకం చేసి మిల్లులకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రైతులకు కలెక్టర్ భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వడ్లను పరిశీలించిన ఆయన వడ్లలో గడ్డి ఎక్కువగా ఉండటాన్ని గమనించారు. తాలు, గడ్డి ఉండటంతో మిల్లు వద్ద తరుగు అని ఇబ్బంది పెడతారని, బాగా తూర్పు పట్టి ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అనంతరం ఆయన తాడిపర్తిలో ఒకటో నెంబర్ రేషన్ షాప్‌ను తనిఖీ చేశారు. వచ్చిన బియ్యం, ఇప్పటి వరకు పంపిణీ చేసిన బియ్యం, ప్రస్తుతం ఉన్న నిల్వలను ఆన్‌లైన్ రిపోర్టు ద్వారా పరిశీలించారు.

కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, ఆర్డీవో సుబ్రమణ్యం, ఎమ్మార్వో పాండు, రాజు, సెక్షన్ సూపరింటెండెంట్ మదన్, డిప్యూటీ తాసీల్దార్ తిలక్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకంపై సమావేశం

రాజోలి, మే 6 : మండలంలోని నసనూరులో ఉపాధి హామీపథకంపై గ్రామస్తులతో అదనపు కలెక్టర్ నర్సింగరావు చర్చించారు. అలాగే పెద్దదన్వాడలోని పొలం బాట పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారికి రోజుకూ రూ. 300 పడేవిధంగా పనిచేయాలన్నారు. పచ్చర్లలో ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. పచ్చర్లలో ఉపాధి హామీకింద నాలుగు పశువుల పాకల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో మార్తమ్మ, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



గోదామును సందర్శించిన అదనపు కలెక్టర్

మదనాపురం, మే 6 : ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం నిల్వ గోదాము, దంతనూరు శివారులోని లక్ష్మీనర్సింహ రైస్‌మిల్లును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లు తీసుకునేప్పుడు తాలు, గడ్డి లేకుండా నిబంధనల ప్రకారం ఉన్నవి వెంటనే తూకం చేసి కొనుగోలు చేయాలని సూచించారు. పాత గన్నీ బ్యాగులు కాకుండా కొత్త బ్యాగులు వాడుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వరిని త్వరగా మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, నాయకులు శేఖర్‌రెడ్డి ఉన్నారు.

## సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అబ్దుల్ ఘనీ

ఖిల్లా ఘణపురం, మే 6 : వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్‌ఘనీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. క్యాంప్‌లో కారమ్స్ ఆటను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తిపరిచారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల సంఖ్యను ఇంకా పెంచాల్సిందిగా సూచించారు. పాఠశాల ప్రాంగణంలో గ్రీనరిని పరిశీలించి మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు. 10వ తరగతిలో 92 శాతం ఉత్తీర్ణతను అభినందిస్తూ 507 మార్కులు సాధించిన విద్యార్థికి అభినందనలు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో మహానంది, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీఎంఆర్ చెక్కుల పంపిణీ

కొత్తకోట, మే 6 : మున్సిపల్ కేంద్రంలోని మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ బాధితులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని కానాయపల్లిలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రావుల సురేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా బాధితులు అంజమ్మ, సాలమ్మ, చెన్నమ్మ, శంకరమ్మ, రేఖ, రాఘవేంద్రకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీను, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదయ్య, వెంకటేశ్, బాధితులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి మృతి

అలంపూర్‌చౌరస్తా, మే 6 : ఉండవల్లి మండలం బైరాపురంలో కుర్వ అరవింద్‌కుమార్(23) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందినట్లు ఉండవల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై మహేశ్ తెలిపారు. కుటుంబ కలహాలతోనే ఆత్మ హత్య చేసుకొని ఉండొచ్చని పేర్కొన్నారు. మృతుడి తండ్రి కుర్వ దివాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### మహిళ ఆత్మహత్య

మల్దకల్, మే 6 : మద్యానికి బానిసై భర్త వేధింపులు భరించలేక మహిళ ఉరేసుకొని మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై నందికర్ వివరాల మేరకు మండలంలోని మద్దెల బండలో నెల్లూరు జిల్లా కనిగిరి మండలం వీరనకరకు చెందిన హరికృష్ణ, అనిత ఇద్దరు 3నెలల కిందట జీవనోపాధి కోసం మద్దెల బండలో జ్యూస్‌సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే భర్త హరికృష్ణ మద్యానికి బానిసై ప్రతిరోజూ భార్య అనితను వేధించేవాడు. అయితే ఈ వేధింపులు భరించలేక తాము ఉండే కిరాయి ఇంట్లోనే ఈ నెల5న ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలి తల్లి వెంగమ్మ ఫిర్యాదు మేరకు హరికృష్ణపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

### ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

రాజోళి, మే 6: ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై జగదీశ్ కథనం మేరకు.. మండలంలోని మాన్‌దొడ్డికి చెందిన సోమిరెడ్డి(51) ఉప్పరి నర్సింహులుకు చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వచ్చారు. ఈక్రమంలో పొలం పనులు చేయడానికి పచ్చర్ల శివారులో ఉన్న తన పొలాన్ని దున్ని తిరిగి వస్తుండగా మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి సోమిరెడ్డి ట్రాక్టర్‌పై నుంచి కిందపడి గాయాలుల య్యాయి. గమనించిన బంధువులు ఆయనను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### కేసు నమోదు

గద్వాల అర్బన్, మే 6 : భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు గద్వాల టౌన్ ఎసై కళ్యాణ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన గోకారి, మహేశ్వరీ భార్యభర్తలు మంగళవారం ఉదయం ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో సహనం కోల్పోయి భార్య మహేశ్వరిపై భార్త గోకారి దాడి చేసి గాయపర్చాడు. దీంతో భార్య పోలీస్ స్టేషన్ ఆశ్రయించి తన భర్తపై ఫిర్యాదు చేయగా బాధితురాలు ఫిర్యాదు మేరకు గోకారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

గట్టు, మే 6 : గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వైద్యాధికారి టీకే రమేశ్ ఆశలను కోరారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశకార్యకర్తలకు మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు.

## కళాశాల వార్షిక కార్యక్రమాల తనిఖీ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న పీయూ అధికారులు

వనపర్తి టౌన్, మే 6 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను పాలమూరు యూనివర్సిటీ అకాడమిక్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌లు మంగళవారం వార్షిక కార్యక్రమాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా కళాశాల వనపర్తిలో విద్యార్థినులకు కావాల్సిన అన్ని రకాల కోర్సు సౌలభ్యతను, నచ్చిన గ్రూపును డిగ్రీ స్థాయిలో ఎంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. దోస్తు మొదటి విడతలో భాగంగా ఈనెల 21 వరకు నమోదు చేసుకొని 22 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. 2025–26 సంవత్సరానికి గానూ దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తెలిపారు. అదేవిధంగా వార్షిక కార్యక్రమాలపై తనిఖీలు చేసి ప్రిన్సిపల్, అధ్యాపకులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, అకాడమీ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, విష్ణుమూర్తి, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్



అవగాహన కలిగిస్తున్న వ్యవసాయ అధికారులు

గోపాల్‌పేట, మే 6 : రైతులు వరి పంట తగ్గించి ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఏదుల రైతు వేదికలో 'రైతు ముంగిట్లో..శాస్త్ర వేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్ర వేత్తలు పాల్గొని రైతులకు పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల వాడకం, అధిక దిగుబడులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మాధురి, డాక్టర్ మహేశ్వరమ్మ, మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## కార్ల్ మార్క్స్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లి

వనపర్తి టౌన్, మే 6 : జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లి ముఖ్య అతిథిగా హాజరై కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ సిద్ధాంత రచన కమ్యూనిస్ట్ ప్రణాళిక విడుదలై 177 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ కాలంలో ప్రపంచాన్ని కార్మిక వర్గ సిద్ధాంతంగా మార్క్సిజం అజేయంగా ముందుకు పోతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక, ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు జబ్బార్, గోపి, బాల్‌రెడ్డి, రాజు, లక్ష్మి, మేకల ఆంజనేయులు, రమేశ్, వెంకటేశ్, బాల్యనాయక్, గుంటి వెంకటేశ్, పరమేశ్వరాచారి, కృష్ణయ్య, పాల్గొన్నారు.

## తరుగు పేరిట దోపిడీని అరికట్టాలి



రైతులతో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మల్దకల్, మే 6: తరుగు పేరిట దోపిడీని అరికట్టాలని, వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశాడు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద తరుగు పేరిట 40కేజీ బస్తాకు 600 గ్రాములు గన్నీ బ్యాగులు తరుగు తీయాల్సి ఉండగా రెండున్నర కిలోల వరకు తరుగు పేరిట దోపిడీ చేయడం ఎంతవరకు సమంజసమని ఆరోపించారు. రైతులకు కేంద్రం వద్ద వసతులు కల్పించడంలో అధికారులు విఫలం చెందారని పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి రైతుల పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజు, తిమ్మప్ప, లక్ష్మన్న, బలిజరాజు తదితరులు పాల్గొన్నారు.



హోటల్ యజమానికి నోటీస్ ఇస్తున్న ఆహార భద్రత అధికారి

## నిబంధనల మేరకు కొనుగోలు చేయాలి

వనపర్తి టౌన్, మే 6 : వడ్లు తీసుకునేటప్పుడు తాలు, గడ్డి లేకుండా నిబంధనల ప్రకారం ఉన్నవి వెంటనే తూకం చేసి కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం వనపర్తి మండలంలోని కడుకుంట్ల, చిమనగుంటపల్లి వరి కొనుగోలు కేంద్రాలను, పెద్దమందడి మండలం వెల్టూర్ వద్ద ఆగ్రోస్, మదనాపురం గోదాము, దంతనూరు లక్ష్మీనర్సింహా రైస్ మిల్లులను తనిఖీ చేశారు. వరిలో తాలు లేకుండా చూడాలని, అదేవిధంగా కొత్త గన్నీ బ్యాగులు వాడుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన వరిని మిల్లులకు త్వరగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు ఉన్నారు.

**హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి**

జిల్లాలోని హోటళ్లు, అల్పాహార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని ఆహార భద్రత ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రామచంద్రరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉడిపి హోటల్లో ఇడ్లిలో జెర్రీ శీర్షికన వచ్చిన వార్తకు స్పందించి ఉడిపి హోటల్‌ను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం పరిశుభ్రత లేకపోవడంతో నోటీసు జారీ చేస్తున్నట్లు తెలిపారు. హోటళ్లు, అల్పాహార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని లేనిపక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్, మే 6 : దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సుధారాణి తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు మూడేళ్లలో ప్రవేశం పొందేందుకు తల్లిదండ్రులు కోల్పోయిన, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు, నిరాశ్రయులైన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ప్రతి కోర్సులో 60 సీట్లకు గానూ మొత్తం 240 సీట్లలో 70శాతం సీట్లు వీరికే కేటాయిస్తామని చెప్పారు. పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్న, పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని చెప్పారు. మే15వ తేదీలోగా జిల్లా కేంద్రంలో బాలరక్ష భవన్‌లో సమర్పించాలని, వివరాలకు 8465957488, 9966493474 నెంబర్లను సంప్రదించాలని చెప్పారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

వనపర్తిటౌన్, మే 6 : జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మాజీ కౌన్సిలర్లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు సూరి, ఆర్టీఏ సభ్యుడు జహంగీర్, మాజీ కౌన్సిలర్లు కృష్ణ, విజయ చందర్, సమన్వయకర్త సతీశ్, వెంకటేశ్, మన్నెంకొండ, కృష్ణబాబు, కిరణ్‌కుమార్, మోహన్, కార్తీక్ పాల్గొన్నారు.

## పదోన్నతులు పొందిన ఉద్యోగులకు సన్మానం



కండక్లర్లు, డ్రైవర్‌ను సన్మానిస్తున్న అధికారులు

వనపర్తి టౌన్, మే 6 : వనపర్తి ఆర్టీసీ డిపోలో 33 సంవత్సరాలకు పైబడి విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పదోన్నతులు విడుదల చేయగా వనపర్తి డిపో నుంచి 10మంది కండక్టర్లు, ఒక డ్రైవర్ పదోన్నతి పొందారు. డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బాల్‌రెడ్డి, మెకానికల్ పోర్‌మెన్ దేవేందర్, టీఏ సాయిరెడ్డి, జీసీపీవీ స్వామి సన్మానించారు. 33 సంవత్సరాలుగా కండక్టర్, డ్రైవర్లుగా సేవలందించారని, పదోన్నతులు మరింత బాధ్యతలు పెంచాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి నాగేశ్వర్, ప్రచార కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి కురుమయ్య, కంట్రోలర్ రాములు, ఏఎన్ రావు, ఆంజనేయులు, బద్రీనాయక్, రవి పాల్గొన్నారు.

## విరాళం అందజేత

కొత్త కోట, మే 6: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి మండలంలోని కనిమెట్టకు చెందిన కలకొండ మణిమాల రవిప్రకాశ్ దంపతులు రూ. 2,51,116ల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు దూపం నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు దాతలను శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

## కొత్తకోట ప్రభుత్వ పాఠశాలలో యంగ్ ఇండియా క్యాంప్ నిర్వహణ

కొత్త కోట, మే 6 : యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహణలో భాగంగా కొత్త కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల వేసవి శిబిరాన్ని మంగళవారం వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరం ద్వారా విద్యార్థులలో శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15 నుంచి 20 రోజులపాటు వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో మహానంది, వలంటీర్లు రామేశ్వరి, జ్యోష్ణవి, డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

గద్వాల రూరల్, మే 6 : ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు అన్నారు. మంగళవారం గద్వాల పట్టణ పరిధిలోని జములమ్మ ఆలయం వద్ద ఆటోపై ట్రాఫిక్ సంబంధించిన జాగ్రత్తలు తెలియజేసిన స్టిక్కర్లను అతికించి మైక్ ద్వారా ట్రాఫిక్ రూల్స్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పట్టించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

అమరచింత, మే 6 : జాతీయ ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు, టెంట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతోపాటు మౌలిక వసతులను కల్పించాలని డీఆర్డీఏ వనపర్తి జిల్లా పీడీ ఉమాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లలో ఎంపీడీవో శ్రీపాదు, ఎంపీవో శ్రీరామ్‌రెడ్డితో కలిసి నర్సరీని, గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అధికారులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్త కోట, మే 6 : మండలంలోని రాయినిపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దేశీ నాగన్న సోదరుడు బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త దేశీ పెద్దరాములు మంగళవారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, మాజీ సర్పంచులు ఉన్నారు.